# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 04 మార్చి 2026 | www.balagamtv.com | పేజీలు 4




## రాష్ట్రంలో మే 11 నుంచి జనగణన

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు
- గణన ఎన్యూమరేషన్ ప్రక్రియ విధివిధానాలను కలెక్టర్లకు వివరించిన సీఎస్

వివరాలు 2వ పేజీలో

# క్షేత్రస్థాయిలో కలెక్టర్లు పర్యటించాల్సిందే..



- నెలకు కనీసం 10 రోజులు పర్యటించాలి
- పాఠశాలలపై ప్రత్యేక దృష్టి
- వైద్య, సంక్షేమ రంగాల్లో చర్యలు
- పనితీరు బాగాలేకపోతే చర్యలు తప్పవు
- సీఎం రేవంత్ రెడ్డి
- సచివాలయంలో కలెక్టర్ల సదస్సు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఐఏఎస్ కావడం సులభం కాదని, అయితే ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే ఆ ఉద్యోగానికి నిజమైన సార్థకత ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించని అధికారులకు ప్రజల సమస్యలు ఎప్పటికీ అర్థం కావని హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలకు కనీసం 10 రోజులు గ్రామాలు, పట్టణాల్లో పర్యటించాలని కలెక్టర్లను ఆదేశించారు.

**ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగస్వామ్యం**

మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించనున్న 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామసభల్లో ప్రభుత్వ ఖర్చులు, లబ్ధిదారుల వివరాలు చదివి వినిపించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఉన్న 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పర్యవేక్షణకు ఒక్కో అధికారిని నియమించాలని తెలిపారు. కలెక్టర్లు వారానికి ఒకసారి ప్రభుత్వ పాఠశాలలో భోజనం చేయాలని సూచించారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పాఠశాలల పట్ల నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఒక మండల కేంద్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను అన్ని సదుపాయాలతో ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రులను మెడికల్ కాలేజీలతో అనుసంధానం చేసి పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే లక్ష్యమని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల అక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని, బోగస్ నియామకాలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లర్ల వద్ద ఉన్న ధాన్యాన్ని వెనక్కి రాబట్టే బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. మోసాలకు పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై కఠినంగా వ్యవహరించకపోతే కలెక్టర్, ఎస్పీని అక్కడికక్కడే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు.

"ప్రభుత్వం మిమ్మల్ని నిశితంగా గమనిస్తుంది. మంచి పని చేస్తే అభినందిస్తుంది. పనితీరు బాగాలేకపోతే చర్యలు తప్పవు" అని సీఎం స్పష్టం చేశారు. వార్షిక పనితీరు నివేదికల ఆధారంగా అధికారుల పనిని అంచనా వేస్తామని, జూన్‌లో మరోసారి కలెక్టర్ల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టర్లు నెలకు కనీసం 10 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించారు. వారానికి ఒకసారి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు. పాఠశాలల పట్ల నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు, మిల్లర్ల వ్యవహారంలో అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. పని తీరు సంతృప్తికరంగా లేకపోతే కలెక్టర్, ఎస్పీని అక్కడికక్కడే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. జూన్‌లో కలెక్టర్ల పనితీరుపై మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

**అయిదు దశల్లో అమలు**

ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికకు ప్రణాళికశాఖ నోడల్ శాఖగా వ్యవహరించనుంది.

మార్చి 6: ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు

ఏప్రిల్ 2: గ్రామ స్థాయి కార్యక్రమాలు

ఏప్రిల్ 16: మండల స్థాయి కార్యక్రమాలు

మే 2: నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు

మే 22: జిల్లా స్థాయి కార్యక్రమాలు

99 రోజుల్లో శాఖల వారీగా అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమ పర్యవేక్షణ కోసం ప్రత్యేక మొబైల్ యాప్ రూపొందించనున్నారు.

# ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం భీకరం



- ఒమన్ తీరంలో దాడులు..
- ముగ్గురు భారత నావికుల మృతి
- కువైట్‌లో అమెరికా స్థావరంపై దాడి..
- ఆరుగురు సైనికులు మృతి

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఇరాన్--ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం నాలుగో రోజుకు చేరుకుని భీకరరూపం దాల్చింది. అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు ఇరాన్‌లోని కీలక స్థావరాలపై దాడులు ముమ్మరం చేస్తుండగా.. ఇరాన్ కూడా ప్రతిదాడులతో విరుచుకుపడుతోంది. మంగళవారం పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. కువైట్లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ సైన్యం దాడి చేయగా.. ఆరుగురు అమెరికా సైనికులు మృతిచెందినట్లు సమాచారం.ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు ఇరాన్‌పై దాడులు తీవ్రతరం చేశాయి. ఇరాన్ అధ్యక్ష భవనం, మిలిటరీ శిక్షణ కేంద్రం, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యాలయం లక్ష్యంగా వైమానిక దాడులు జరిపినట్లు సమాచారం. ఇప్పటివరకు జరిగిన దాడుల్లో 787 మంది ఇరానీలు మృతిచెందినట్లు అంచనా. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

**ఒమన్ తీరంలో వాణిజ్య నౌకలపై దాడులు**

ఈ యుద్ధ ప్రభావం సముద్ర మార్గాలపైనా పడింది. ఒమన్ తీర ప్రాంతంలోని వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేసినట్లు సమాచారం. ఈ ఘటనల్లో ముగ్గురు భారతీయ నావికులు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ తెలిపిన వివరాల ప్రకారం గల్ఫ్ ఆఫ్ ఒమన్, హార్ముజ్ జలసంధి, పర్షియన్ గల్ఫ్ ప్రాంతాల్లో పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నట్లు వెల్లడించింది. క్షిపణి, డ్రోన్ దాడులు జరిగే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని షిప్ ఆపరేటర్లకు అడ్వైజరీ జారీ చేసింది.

భారత జెండా ఉన్న నౌకలను నిలిపివేసినట్లు సమాచారం లేదని షిప్పింగ్ డైరెక్టర్ జనరల్ శ్యామ్ జగన్నాథన్ తెలిపారు. ప్రభావిత నావికులను స్వదేశానికి తరలించేందుకు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం చర్యలు చేపట్టిందన్నారు. పర్షియన్ గల్ఫ్ సమీపంలో చిక్కుకుపోయిన భారతీయ నావికులకు తక్షణ సాయం అందించేందుకు ప్రత్యేక ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నావికుల కుటుంబాలు, షిప్పింగ్ సంస్థలు, ట్రేడ్ యూనియన్లు, విదేశాల్లోని భారత మిషన్లతో సమన్వయం చేస్తూ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో పరిస్థితి ఎటువైపు దారి తీస్తుందో అన్న ఆందోళన అంతర్జాతీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## పశ్చిమాసియా ఉద్రిక్తతలపై ప్రధాని ఆందోళన

- 48 గంటల్లో 8 దేశాధినేతలతో మోదీ ఫోన్ సంభాషణలు



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ దేశాలపై దాడులు జరగడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత 48 గంటల్లో పశ్చిమాసియా ప్రాంతానికి చెందిన ఎనిమిది దేశాల అధినేతలతో ఫోన్ ద్వారా మాట్లాడారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, జోర్డాన్, బహ్రెయిన్, ఒమన్, కువైట్, ఖతార్ దేశాల నాయకులతో మోదీ చర్చలు జరిపారు. మంగళవారం మధ్యాహ్నం ఒమన్ సుల్తాన్ హైతామ్ బిన్ తారిక్, కువైట్ యువరాజు షేక్ సబాహ్ అల్ ఖలేద్, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీతో ఫోన్‌లో మాట్లాడారు. ఒమన్, కువైట్ దేశాల్లో నివసిస్తున్న భారతీయుల భద్రత, సంక్షేమ అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఆయా దేశాల సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతను ఉల్లంఘిస్తూ జరిగిన దాడులను ఖండించిన మోదీ, ఈ క్లిష్ట సమయంలో భారత్ వారి ప్రజలతో ఐక్యతగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఇక కేంద్ర విదేశాంగ శాఖ కూడా పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ప్రాంతీయ స్థిరత్వం, భారతీయుల భద్రతే తమకు ప్రాధాన్యమని ప్రభుత్వం పేర్కొంది.

## ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయాలి

- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- కొత్త కలెక్టర్లతో మంత్రి భేటీ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. మంగళవారం సచివాలయంలో ఇటీవల బాధ్యతలు చేపట్టిన జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ తదితర జిల్లాల కలెక్టర్లు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

**సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరాలి**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత రెండేళ్లలో ముఖ్యమంత్రి నాయకత్వంలో పేదల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆ పథకాలను అర్హులైన ప్రతి పేదవాడికి చేర్చే బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యం చేస్తూ జిల్లాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత కలెక్టర్లపై ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల అవసరాలను అర్థం చేసుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్‌గా పని చేయడం అత్యంత కీలకమైన అవకాశమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలతో మమేకం కావాలని, ప్రజాకేంద్ర పాలన సాగించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పని చేయడం ద్వారా అన్ని అంశాలపై అవగాహన పెరుగుతుందని, ఆ అనుభవం భవిష్యత్తులో ఉపయోగపడుతుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను సమర్థంగా అమలు చేసి అర్హులైన ప్రతిఒక్కరికీ ఫలాలు అందేలా చూడాలని అన్నారు. అధికార యంత్రాంగం ఒక బృందంగా పనిచేసి ప్రజలకు మేలు చేసే పనులనే ప్రాధాన్యంగా తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.



## ముగిసిన సంపూర్ణ చంద్రగ్రహణం

- వీక్షించిన ప్రజలు
- గ్రహణం అనంతరం తిరుమలలో శ్రీవారి దర్శనాలు పునఃప్రారంభం

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

ఆకాశంలో మంగళవారం అరుదైన ఖగోళ దృశ్యం ఆవిష్కృతమైంది. ఈ ఏడాది తొలి సంపూర్ణ చంద్రగ్రహణం ప్రపంచవ్యాప్తంగా వీక్షకులను అలరించింది. భూమి నీడ చంద్రుడిపై పడటంతో జాబిల్లి పూర్తిగా ఎర్రటి రంగులో మెరిసి 'బ్లడ్ మూన్'గా దర్శనమిచ్చింది. భారత్‌లోనూ పలు ప్రాంతాల్లో గ్రహణం స్పష్టంగా కనిపించింది.

భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:20 గంటల తర్వాత గ్రహణం ప్రారంభమైనప్పటికీ, ఆ సమయంలో చంద్రుడు దిగంతానికి దిగువన ఉండటంతో దేశంలో కనిపించలేదు. సాయంత్రం 6:26 గంటలకు చంద్రోదయం తర్వాతే వీక్షణ సాధ్యమైంది. సాయంత్రం 6:33 నుంచి 6:40 గంటల మధ్య గ్రహణం గరిష్ఠ దశకు చేరుకోగా, తూర్పు దిక్కున ఎర్రటి-నారింజ వర్ణంలో చంద్రుడు అద్భుతంగా కనిపించాడు. రాత్రి 6:47 గంటలకు గ్రహణం ముగిసింది. మధ్య, పశ్చిమ భారతంలోని నగరాల్లో చంద్రోదయం సమయానికే గ్రహణం గరిష్ఠ దశలో ఉండటంతో ప్రజలు స్పష్టంగా వీక్షించారు. ఈ ఖగోళ వింతను చూడటానికి ప్రత్యేక పరికరాలు అవసరం కాలేదు.

మిగితా 2వ పేజీలో

## చర్చలకు ఆలస్యం చేసిన ఇరాన్

- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**బలగం టీవీ, వాషింగ్టన్**

ఇరాన్తో సైనిక ఘర్షణ తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో మళ్లీ చర్చలు ప్రారంభించే విషయంలో ఇరాన్ తీవ్రంగా ఆలస్యం చేసిందని మండిపడ్డారు. నాయకత్వం, గగనతల రక్షణ వ్యవస్థ, వాయుసేన, నౌకాదళాన్ని కోల్పోయాక ఇప్పుడు చర్చల గురించి మాట్లాడుతోందని ట్రంప్ విమర్శించారు. ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిపోయిందని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్ వేదికగా పోస్ట్ చేశారు.ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రతినిధి డాక్టర్ అబ్దుల్ మజీద్ హకీమ్ ఇలాహీ భారతీయ వార్తాసంస్థ ఏఎన్ఐకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికాతో చర్చలకు సిద్ధమేనని, అయితే ఇరాన్ ఆత్మగౌరవానికి గౌరవం ఇవ్వాలని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలకు స్పందనగానే ట్రంప్ తాజా వ్యాఖ్యలు చేసినట్లు భావిస్తున్నారు.

ఇరాన్‌పై జరుగుతున్న సైనిక చర్యల వివరాలతో అమెరికా కాంగ్రెస్‌కు ట్రంప్ అధికారిక లేఖ రాశారు. తన ఆదేశాల మేరకే ఫిబ్రవరి 28న అమెరికా సైన్యం దాడులు ప్రారంభించినట్లు తెలిపారు. అమెరికా ప్రయోజనాల పరిరక్షణ, హార్ముజ్ జలసంధి మీదుగా జరిగే సముద్ర రవాణా భద్రత, అలాగే ఇజ్రాయెల్ సహా పశ్చిమాసియాలోని మిత్రదేశాల ఆత్మరక్షణ కోసమే ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇరాన్‌లోని బాలిస్టిక్ క్షిపణి తయారీ యూనిట్లు, నౌకాదళ స్థావరాలు, యుద్ధ నౌకలు, గగనతల రక్షణ వ్యవస్థలు, కమాండ్ కంట్రోల్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు లేఖలో వెల్లడించారు. పశ్చిమాసియాలో ఉన్న అమెరికా సైనికుల భద్రతకే ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఇరాన్‌పై భూతల దాడులు చేపట్టే యోచన లేదని కాంగ్రెస్‌కు స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇరాన్ నుంచి ముప్పును తగ్గించేందుకు, ఆయుధ శక్తిని క్షీణింపజేయడానికే ఈ సైనిక చర్య ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సాధ్యమై నంత తక్కువ ప్రాణనష్టం జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు.

## అక్రమ మైనింగ్, రియల్ ఎస్టేట్ దందాలకు పాల్పడుతోన్న ప్రభుత్వం

- మంత్రి పొంగులేటి సంస్థపై చర్యలు తీసుకోవాలి
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి హరీష్ రావు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ మైనింగ్, రియల్ ఎస్టేట్ దందాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. ఓఆర్ఆర్‌కు ఆనుకుని ఉన్న రాజేంద్రనగర్ మండలంలోని మానసహిల్స్ ప్రాంతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికు చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' సంస్థ ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా అక్రమ క్వారీలు నిర్వహిస్తూ కొండలను పిండి చేస్తోందని ఆయన ఆరోపించారు.

టీఎస్‌పీసీబీ నుంచి సిఎఫ్ఈ, సిఎఫ్ఓ అనుమతులు, పర్యావరణ అనుమతి, మైనింగ్ లీజ్, హెచ్ఎండీఏ క్లియరెన్స్, ల్యాండ్ కన్వర్షన్, ఎక్స్‌ప్లోసివ్స్ లైసెన్స్, గ్రౌండ్ వాటర్ అనుమతులు వంటి ఏవీ లేకుండానే కార్యకలాపాలు కొనసాగుతున్నాయని హరీష్‌రావు పేర్కొన్నారు. భారీ యంత్రాలతో రాత్రింబవళ్లు బండరాళ్లను తొలుస్తూ అక్రమంగా తరలిస్తున్నప్పటికీ రెవెన్యూ, మైనింగ్, పిసిబి, హెచ్ఎండీఏ అధికారులు మౌనం పాటిస్తున్నారని విమర్శించారు.

**17 ఎకరాల భూమి కేటాయింపుపై ప్రశ్నలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అల్లుడి అనుయాయులకు ఓపెన్ బిడ్డింగ్ లేకుండా 17 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించడంపై కూడా హరీష్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పారదర్శకంగా టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిలో భూమి ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతుందని అన్నారు. "సాధారణ ప్రజలకు ఒక న్యాయం, మంత్రులకు మరో న్యాయమా?" అని ప్రశ్నించారు. పేదల ఇళ్లను కూల్చే హైడ్రా సంస్థకు మంత్రుల అక్రమ క్వారీలు ఎందుకు కనిపించడం లేదని విమర్శించారు.

అక్రమ క్వారీలను తక్షణమే నిలిపివేసి, ఇప్పటివరకు దోచుకున్న సహజ సంపదను పెనాల్టీతో సహా రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. 17 ఎకరాల భూ కేటాయింపును వెంటనే రద్దు చేసి, పారదర్శకంగా ఓపెన్ బిడ్డింగ్ నిర్వహించాలని కోరారు. అక్రమ మైనింగ్‌కు సంబంధించిన ఫోటోలు, పూర్తి వివరాలను మీడియా ముందు విడుదల చేస్తున్నట్లు హరీష్‌రావు తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే స్వయంగా అక్కడికి వెళ్లి నిజానిజాలు వెల్లడిస్తామని హెచ్చరించారు.

## బీబీనగర్‌లో విషాదం

- ఇద్దరు చిన్నారులను హతమార్చి తల్లి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని బిబినగర్ సమీప గోల్లగూడెం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. 28 ఏళ్ల మహిళ తన ఇద్దరు చిన్నారులను హతమార్చి అనంతరం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులు ఐశ్వర్య (28), ఆమె రెండేళ్ల కుమార్తె జానకి, 10 నెలల కుమారుడు పాండు అని గుర్తించారు. ఘటనపై మహిళ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. భువనగిరి డిప్యూటీ ఎస్పీ బి. రవీందర్ మాట్లాడుతూ, చిన్నారుల మరణానికి ఖచ్చితమైన కారణం పోస్ట్‌మార్టం నివేదిక తర్వాతే స్పష్టమవుతుందని తెలిపారు. వారిని ఊపిరి ఆడనివ్వకుండా హతమార్చి ఉండొచ్చని అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఐశ్వర్యకు నాలుగున్నరేళ్ల క్రితం గోల్లగూడెంకు చెందిన మహేష్ యాదవ్‌తో వివాహం జరిగింది. అతను రైల్వే ట్రాక్ మెయింటెనెన్స్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వివాహం తర్వాత రెండేళ్లకు కట్న వేధింపులు ప్రారంభమయ్యాయని మహిళ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దాదాపు ఏడాదిన్నర క్రితం ఐశ్వర్య తన పిల్లలతో కలిసి వేములకొండలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. పెద్దల జోక్యంతో దంపతులు మళ్లీ కలసి జీవించేందుకు అంగీకరించారు. సోమవారం సాయంత్రం బంధువులు ఐశ్వర్య, పిల్లలను మళ్లీ అత్తింటికి చేర్చారు. ఆ రాత్రే మహేష్ విధులకు వెళ్లినట్లు సమాచారం. మంగళవారం ఉదయం గది తలుపులు తెరవకపోవడంతో అత్త సత్యమ్మ బలవంతంగా తలుపు తెరిచింది. గదిలో ఐశ్వర్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండగా, ఇద్దరు చిన్నారులు మంచంపై మృతదేహాలుగా కనిపించారు.

మహిళ తండ్రి యాదయ్య ఫిర్యాదులో వివాహ సమయంలో రూ.30 లక్షల కట్నం ఇచ్చినప్పటికీ అదనపు కట్నం కోసం వేధించారని ఆరోపించారు. ఫిర్యాదు ఆధారంగా బిబినగర్ పోలీసులు మహేష్ యాదవ్, అతని సోదరీమణులు అనిత, కవిత, తల్లిదండ్రులు సత్యమ్మ, నర్సింహలపై కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## ఇరాన్‌కు చైనా మద్దతు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇరాన్--అమెరికా--ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలపై చైనా స్పందించింది. పశ్చిమాసియాలో పరిస్థితులు విషమిస్తున్న నేపథ్యంలో చైనా ఇరాన్‌కు మద్దతుగా నిలిచింది. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి, ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేపడుతున్న సైనిక చర్యలను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఇరాన్ తన సార్వభౌమత్వం, భద్రత, ప్రాదేశిక సమగ్రత, జాతీయ గౌరవాన్ని కాపాడుకునేందుకు చేస్తున్న పోరాటానికి చైనా మద్దతు ఇస్తుందని వాంగ్ యి తెలిపారు. ప్రస్తుత పరిణామాలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉన్నందున సంబంధిత దేశాలు అదుపులో ఉండాలని సూచించారు.ఇక యుద్ధ ప్రభావం గల్ఫ్ దేశాలపై కూడా పడుతోంది. సౌదీ అరేబియాలోని అమెరికా రాయబార కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం. ఇరాక్లో పేలుళ్లు చోటుచేసుకున్నాయి.


## తెలంగాణలో విద్యుత్ వినియోగం రికార్డు

- ఒక్కరోజులో 18,139 మెగావాట్లు డిమాండ్
- డిమాండ్‌కు అనుగుణంగా నిరంతరాయ విద్యుత్ సరఫరా : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎండాకాలం ఆరంభంలోనే భానుడి ప్రభావం తీవ్రంగా కనిపిస్తుండటంతో తెలంగాణలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుకుంది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 18,139 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైనట్లు విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక వినియోగంగా పేర్కొన్నారు.

ఇళ్లలో ఎయిర్ కండీషనర్లు, కూలర్లు విస్తృతంగా వినియోగించడం, పరిశ్రమల్లో ఉత్పత్తి కార్యకలాపాలు పెరగడం, వేసవికాల పంటలకు



సాగునీటి అవసరాలు అధికమవడం వంటి కారణాలతో విద్యుత్ డిమాండ్ రోజురోజుకీ పెరుగుతోందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో స్పందించిన ఉప ముఖ్యమంత్రి

మిగితా 2వ పేజీలో

## ఢిల్లీ విమానాశ్రయంలో 80 అంతర్జాతీయ విమానాలు రద్దు

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితులు తీవ్రతరం అవుతుండడంతో అంతర్జాతీయ విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఎయిర్‌స్పేస్ పరిమితులు, భద్రతా కారణాల వల్ల మంగళవారం ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మొత్తం 80 అంతర్జాతీయ విమానాలు రద్దు అయినట్లు అధికారులు తెలిపారు. వీటిలో 36 బయల్దేరవలసిన సర్వీసులు, 44 రానున్న సర్వీసులు ఉన్నట్లు వెల్లడించారు. పశ్చిమ దేశాలకు వెళ్లవలసిన అనేక విమానాలు ఆలస్యమవుతున్నాయి లేదా షెడ్యూల్ మార్పులకు లోనవుతున్నాయి. ఎమిరేట్స్కు చెందిన ఇకె--513 విమానం దుబాయ్‌కు బయల్దేరిన తర్వాత గగనతల అవాంతరాల కారణంగా తిరిగి న్యూఢిల్లీకి చేరుకుంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు విమానయాన వర్గాలు పేర్కొన్నాయి. రోజూ సుమారు 1,300 విమాన సర్వీసులు నడిచే ఢిల్లీ విమానాశ్రయంలో గత మూడు రోజులుగా అంతర్జాతీయ సర్వీసులు తీవ్ర అంతరాయానికి గురవుతున్నాయి. ఈ కాలంలో భారతీయ ఎయిర్‌లైన్స్ కలిపి 1,117 అంతర్జాతీయ సర్వీసులను రద్దు చేసినట్లు సమాచారం.

# ముగిసిన సంపూర్ణ చంద్రగ్రహణం

(మొదటి పేజీ తరువాయి)

**సూతక్ కాలం పాటించిన భక్తులు**

చంద్రగ్రహణం సందర్భంగా దేశవ్యాప్తంగా హిందూ సంప్రదాయాల ప్రకారం సూతక్ కాలం పాటించారు. గ్రహణానికి ముందుగానే సూతక్ ప్రారంభమై, గ్రహణం ముగిసిన అనంతరం పూర్తయింది. అనేక మంది ఉపవాసాలు పాటిస్తూ శుభకార్యాలకు దూరంగా ఉన్నారు.

**తిరుమలలో శ్రీవారి దర్శనాలు పునఃప్రారంభం**

గ్రహణం కారణంగా మూసివేసిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయం ద్వారాలు రాత్రి తిరిగి తెరుచుకున్నాయి. ఆగమశాస్త్ర నియమాల ప్రకారం ఉదయం నుంచే ఆలయ తలుపులు మూసివేశారు. గ్రహణం ముగిసిన అనంతరం ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం వంటి కైంకర్యాలు పూర్తి చేసి రాత్రి 8 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. అలాగే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో అన్నప్రసాద వితరణను రాత్రి 8:30 గంటల నుంచి పునఃప్రారంభించారు. లడ్డూ విక్రయ కౌంటర్లు కూడా తెరిచారు. రోజంతా దర్శనానికి దూరమైన భక్తులు రాత్రి నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. మరో సంపూర్ణ చంద్రగ్రహణం 2028 చివరి వరకు కనిపించదని శాస్త్రవేత్తలు పేర్కొనడంతో, ఈ అరుదైన దృశ్యాన్ని అనేక మంది తమ కెమెరాల్లో బంధించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.

# చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు మృతి

**బలగం టీవీ, సూరారం**



హోలీ పండుగ వేళ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా సూరారంలో తీవ్ర విషాద ఘటన జరిగింది. ఈతకు వెళ్లిన ఇద్దరు బాలురులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి ప్రాణం కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని విశ్వకర్మ కాలనీకి చెందిన సాగర్(17), కృష్ణానగర్‌కు చెందిన అభిషేక్(17) ఇంటర్ చదువుతున్నారు. మంగళవారం హోలీ వేడుకల అనంతరం స్నానం కోసం స్నేహితులతో కలిసి సూరారం పంతులు చెరువులో ఈతకు వెళ్లారు. ఉత్సాహంగా నీటిలోకి దిగిన వారు చెరువులోని లోతైన ప్రాంతానికి వెళ్లడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతిచెందారు. స్నేహితులు వెంటనే సూరారం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు చేపట్టి రెండు మృతదేహాలను వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అప్పటి వరకు స్నేహితులతో కలిసి సంతోషంగా రంగులు చల్లుకుంటూ గడిపిన విద్యార్థులు ఆ తర్వాత విగతజీవులుగా మారడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. సెలవు రోజుల్లో పిల్లలు చెరువులు లేదా ప్రమాదకరమైన జలాశయాల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూరారం సీఐ ఎస్ సుధీర్ కృష్ణ సూచించారు.

# జడ్చర్ల ఆస్పత్రి ఘటనలో నలుగురు వైద్యాధికారుల సస్పెన్షన్

**బలగం టీవీ, జడ్చర్ల**

జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో మృతదేహాన్ని కుక్కలు తిన్న ఘటనపై నలుగురు అధికారులను రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ సస్పెండ్ చేశారు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ మంగళవారం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ, ఆర్ఎంవో హరినాథ్, డ్యూటీ డాక్టర్ మునీషా, ఎంఎనీ రవిప్రకాష్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆస్పత్రి నిర్వహణలో సూపరింటెండెంట్ నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఆరు నెలల కిందటే పోస్టుమార్టం గదిని పూర్తి చేసి కాంట్రాక్టర్ ఆస్పత్రికి అప్పగించారని తెలిపారు. అయినా అక్కడ పోస్టుమార్టం కార్యకలాపాలు నిర్వహించకపోవడంతోపాటు కొత్తగా వచ్చిన ఫ్రీజర్లను ప్రారంభించకపోవడంతోనే నేడు ఈ ఘటన జరిగినట్టు వివరించారు. ఆస్పత్రిలో వైద్యుల పనితీరు కూడా సరిగా లేదన్నారు. ఈ ఘటనపై కూడా పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆస్పత్రిలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు.

# యూట్యూబ్‌లో మోడీ 3 కోట్ల సబ్‌స్క్రైబర్లు

- **ప్రపంచ నేతల్లో అత్యధిక ఫాలోయింగ్‌తో అగ్రస్థానం**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికలపై తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకున్నారు. వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ YouTubeలో ఆయన అధికారిక చానెల్ 3 కోట్ల (30 మిలియన్ల) సబ్‌స్క్రైబర్ల మైలురాయిని దాటింది. దీంతో ప్రస్తుత, మాజీ దేశాధినేతలలో యూట్యూబ్‌లో అత్యధిక సబ్‌స్క్రైబర్లు కలిగిన నేతగా మోదీ అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు. డిజిటల్ కమ్యూనికేషన్‌లో మోదీకి ఉన్న ప్రభావం, ప్రజలతో నేరుగా మమేకమయ్యే శైలి ఈ గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకు 66 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు మాత్రమే ఉన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్తో పోలిస్తే మోదీకి దాదాపు ఏడు రెట్లు అధిక సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. దేశీయంగా చూస్తే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యూట్యూబ్ చానెల్ కంటే మోదీ చానెల్‌కు సుమారు మూడు రెట్లు అధిక సబ్‌స్క్రైబర్లు ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఆమ్ ఆద్మీ పార్టీ , భారత జాతీయ కాంగ్రెస్అధికారిక చానెళ్ల కంటే కూడా మోదీ వ్యక్తిగత చానెల్‌కు నాలుగు రెట్లు ఎక్కువ మంది అనుచరులు ఉన్నారు.ఇటీవల ఫిబ్రవరి 26న Instagramలో 10 కోట్ల (100 మిలియన్ల) ఫాలోవర్ల మార్కును మోదీ అధిగమించారు. ఈ ఘనత సాధించిన తొలి ప్రపంచ నేతగా ఆయన రికార్డు సృష్టించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రంప్‌కు 43.2 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో (15 మిలియన్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా (14.4 మిలియన్లు), టర్కీ అధ్యక్షుడు రెజెప్ తయ్యిప్ ఎర్డోగాన్ (11.6 మిలియన్లు) తదితరులు తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

# రాష్ట్రంలో మే 11 నుంచి జనగణన

- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు**
- **గణన ఎన్యూమరేషన్ ప్రక్రియ విధివిధానాలను కలెక్టర్లకు వివరించిన సీఎస్**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మే 11 నుంచి "2027 జనగణన" మొదటి దశ ప్రారంభమవుతుందనీ, పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. తెలంగాణ సెన్సెస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళికేరితో కలిసి ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. రాబోయే గణన ఎన్యూమరేషన్ ప్రక్రియ విధివిధానాలను వారికి సీఎస్ వివరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ డేటాను మొబైల్ అప్లికేషన్ ద్వారా సేకరిస్తారని చెప్పారు. ఇండ్ల గుర్తింపు ప్రక్రియను రాష్ట్ర వ్యాప్తంగా పారదర్శకతతో చేపట్టాలని సూచించారు. జనాభా గణనలో పౌరులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో స్వచ్ఛందంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్టు తెలిపారు. ఇల్లు, నివాసం, మారుమూల నివాసం, కుగ్రామం పట్టణ మురికివాడల గణన ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. సమయపాలనకు కట్టుబడి ఉండటం, డేటా నాణ్యత ప్రమాణాల నిర్వహణ, కార్యకలాపాల్లో పారదర్శకత, గణన ప్రక్రియ యొక్క ప్రతి దశలో సజావుగా జరగాలని ఆదేశించారు.

మారుమూల ప్రాంతాల్లో గణనకు సంబంధించి ఎన్యూమరేటర్లకు రవాణా, ఇతర సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు నిర్మాణాత్మక శిక్షణ నమూనాను భారతి హోళీకేరీ ఈ సందర్భంగా వివరించారు. సురక్షితమైన డేటా సేకరణ, మొబైల్ ఆధారిత అప్లికేషన్లు, బ్యాకెండ్ పర్యవేక్షణ విధానాలతో సహా అధునాతన డిజిటల్ వ్యవస్థల పని తీరును ఆమె వివరించారు. ఎన్యూమరేషన్ బ్లాక్‌ల ఖరారు, అధికార పరిధి సరిహద్దుల ధ్రువీకరణను సులభతరం చేయడానికి స్థానిక అధికారులతో సమన్వయంపై ఆమె కలెక్టర్లకు మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, జీఏడీ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సమాచార శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో విద్యుత్ వినియోగం రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

భట్టి విక్రమార్క రాష్ట్రంలో డిమాండ్‌కు అనుగుణంగా నిరంతరాయ విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నామని చెప్పారు. భారీ డిమాండ్ ఉన్నప్పటికీ ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ అందిస్తున్నందుకు శాఖ సిబ్బందిని అభినందించారు.

తెలంగాణలో విద్యుత్ వినియోగం పెరగడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సంకేతమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఐటీ, ఔషధ తయారీ, నీటి ప్రాజెక్టుల విస్తరణతో పాటు వ్యవసాయ, పారిశ్రామిక రంగాల విస్తరణ కారణంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. 2023–24లో రాష్ట్ర గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15,623 మెగావాట్లు కాగా, ప్రస్తుతం అది 18,139 మెగావాట్లకు పెరగడం విశేషమని తెలిపారు.

దేశంలో పెద్ద రాష్ట్రాలైన మధ్యప్రదేశ్ (19,900 మెగావాట్లు), రాజస్థాన్ (20,600 మెగావాట్లు) స్థాయికి తెలంగాణ చేరువ కావడం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. పరిశ్రమల పరంగా ముందున్న పంజాబ్, హర్యానా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల కంటే తెలంగాణలో అధిక విద్యుత్ డిమాండ్ నమోదవడం విశేషమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉన్నప్పటికీ అవసరమైనంత విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## దుబాయ్ నుంచి 149 మంది భారతీయుల రక్షణ

**బలగం టీవీ, హైదరాబాద్**

మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా దుబాయ్లో చిక్కుకుపోయిన 149 మంది భారతీయులను ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా సురక్షితంగా స్వదేశానికి తీసుకొచ్చింది. ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా నడిపిన AI916D విమానం మంగళవారం ఉదయం 10:58 గంటలకు ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. ఖి–జుణజ రిజిస్ట్రేషన్ గల ఈ విమానంలో మొత్తం 149 మంది ప్రయాణికులు ఉన్నారు.ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో భారతీయ విమానయాన సంస్థ నడిపిన తొలి రక్షణ విమానం ఇదే కావడం విశేషం. "దుబాయ్‌లో చిక్కుకున్న ప్రయాణికులను స్వదేశానికి స్వాగతిస్తున్నాం" అని ఎయిర్ ఇండియా పేర్కొంది.

ఇదే ఆపరేషన్‌లో భాగంగా అంతకుముందు AI918D ప్రత్యేక విమానం ఢిల్లీకి చేరుకుంది. ఈ విమానంలో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సహా ఎయిర్ ఇండియాకు చెందిన 143 మంది కాక్‌పిట్, క్యాబిన్ సిబ్బందిని సురక్షితంగా తరలించారు. సిబ్బంది సురక్షితంగా చేరుకోవడంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.ప్రత్యేక విమానాల నిర్వహణ కోసం ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ సహా అనుబంధ బృందాలు రాత్రింబవళ్లు పనిచేశాయని సంస్థ తెలిపింది. అసాధారణ పరిస్థితుల్లోనూ తరలింపు ప్రక్రియను విజయవంతం చేసేం దుకు సంబంధిత అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిం చినట్లు వెల్లడించింది. ప్రయాణికులు, సిబ్బందిని సురక్షితంగా తీసుకురా వడంలో సహకరించిన భారత ప్రభుత్వం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), దుబాయ్ స్థానిక అధికారులకు ఎయిర్ ఇండియా కృతజ్ఞ తలు తెలిపింది. ప్రయాణికుల భద్రతే తమకు ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేస్తూ, అవసరమైన అనుమతులు లభించిన వెంటనే మరిన్ని ప్రత్యేక విమానాలను నడపడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది.

## రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ హోలీ శుభాకాంక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్**



రాష్ట్ర ప్రజలకు కే. చంద్రశేఖర్ రావు హోలీ పండుగ సందర్భంగా శు భాకాంక్షలు తెలిపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేతగా ఉన్న కేసీఆర్ తన సందేశంలో హోలీ పండుగ భారతీయ సంస్కృతిలో ప్రత్యేక స్థానం కలిగిన రంగుల పండుగ అని పేర్కొన్నారు. ప్రజల మధ్య ప్రేమాభిమానాలను విరజిమ్మే పండుగగా హోలీ నిలుస్తుందని అన్నారు. ఆకులు రాలే శిశిరం ముగిసి, కొత్త చిగురులు తొడిగే వసంతానికి స్వాగతం పలుకుతూ ప్రకృతిలో నూతనోత్సాహానికి హోలీ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఆశలు దిగజారిన తెలంగాణ ప్రజల్లో ఈ హోలీ కొత్త ఆశలు, విశ్వాసాలు నింపాలని, ప్రజల మధ్య సహోదర భావం మరింత బలపడాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

## ఇరాన్‌పై దాడులను ఖండించకపోవడం దారుణం

- **బీవీ రాఘవులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

కేంద్ర ప్రభుత్వ విదేశాంగ విధానంపై కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ వైఖరి దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్ చేపడుతున్న దాడులను భారత్ ఖండించకపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. చర్చల పేరుతో అకస్మాత్తుగా సైనిక చర్యలు చేపట్టడం అనైతికమని విమర్శించారు.

## నార్సింగిలో జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నార్సింగిలోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని హైడ్రా అధికారులను ఆమె నిలదీశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి హైడ్రా బుల్డోజర్లు పంపించే వరకు ఆందోళన విరమించబోమని హెచ్చరించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు కవితను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను పోలీసు వాహనంలో ఎక్కించే సమయంలో జాగృతి కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. కార్యకర్తలు "వీ వాంట్ జస్టిస్" అంటూ నినాదాలు చేశారు. అక్రమ వెంచర్లను కూల్చడానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ తక్షణమే రావాలని డిమాండ్ చేశారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి నార్సింగి పోలీస్ స్టేషన్కు తరలించారు. అరెస్టు సమయంలో కవిత చేతికి స్వల్ప గాయమైంది.

## రాష్ట్ర ప్రభుత్వ విప్‌ను కలిసిన వేములవాడ సబ్ డివిజన్ డీఎస్పీ



**బలగం టీవీ, వేములవాడ:**

ఇటీవల వేములవాడ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బదిలీపై వచ్చిన శ్రీనివాసులు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

## వేములవాడ నూతన డీఎస్పీగా శ్రీనివాసులు బాధ్యతలు




**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని వేములవాడ సబ్ డివిజన్ కార్యాలయంలో నూతన డిఎస్పీగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, సిబ్బంది ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన డిఎస్పీగా మాట్లాడుతూ.. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## యువకుడిపై దాడి కేసులో వ్యక్తులు అరెస్ట్

- ఎస్సీ/ఎస్టీ చట్టం కింద ముగ్గురు అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డిఎస్పీ నాగేంద్రచారి.



**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలో యువకుడిపై దాలిడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 27, 2026 అర్ధరాత్రి సమయంలో బి.వై నగర్‌లోని జెండా గద్దె సమీపంలో మూల అభిలాష్, మొహమ్మద్ అబ్దుల్ ఆదీప్, కారంపూరి నికిత్ మరియు మరికొంత మంది కలిసి ఆకునూరి కళ్యాణ్ (26), అంబేద్కర్ నగర్, సిరిసిల్ల నివాసి తో గొడవకు దిగారు. ఈ సందర్భంగా వారు కళ్యాణ్‌ను కులం పేరుతో దూషిస్తూ చేతులతో కొట్టడం, కాళ్లతో తన్నడం మాత్రమే కాకుండా బండరాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాధితుడి తల్లి ఆకునూరి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం (ఘ్‌వఎజ్ఞ్‌ శీ వీబతీసవతీ) మరియు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించబడిందని తెలియజేశారు. నిందితులు ఏ1 మూల అభిలాష్, స్వగ్రామం వేల్గిపూర్, ఇల్లంతకుంట మండలం, ప్రస్తుతం గీతానగర్, సిరిసిల్ల..,ఏ2 మొహమ్మద్ అబ్దుల్ ఆదీప్, గీతానగర్, సిరిసిల్ల..,ఏ3 కారంపూరి నికిత్, మార్కండేయ వీధి, సిరిసిల్ల.., మరియు మరికొంత మంది నిందితులు ఉన్నారని తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులు రెండు మోటార్ సైకిళ్లు, ఐదు మొబైల్ ఫోన్లు, దాడికి ఉపయోగించిన రాళ్లు అని, ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని హెచ్చరించారు.



## రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్రైస్తవ ఐక్యతను చాటుదాం..

- వేములవాడ మండల పాస్టర్ అసోసియేషన్ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్ పల్లి గ్రామంలో గల సత్య దైవార్చన మందిరం లో వేములవాడ మండలం పాస్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు పసుల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా, ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజేష్ మాట్లాడుతూ.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్రైస్తవులు అందరూ ఏకతాటిపైకి వచ్చి ఐక్యత ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎలీషా వాక్యం సందేశం చేస్తూ మాట్లాడుతూ పాస్టర్ లందరూ ఏక తీర్మానంతో సేవ పరిచర్యలు ముందుకు సాగుతూ ఐక్యంగా ఉండాలని సూచించారు. మండలానికి వచ్చిన నూతన జిల్లా కమిటీని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాస్టర్స్ తిమోతి, రాజు, ఐజాక్, జిల్లా నూతన కమిటీ క్యాషియర్ ప్రభుదాస్, జాయింట్ సెక్రెటరీ జోసెఫ్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆహారోను, జిల్లా మీడియా కన్వీనర్ కులేరి కిషోర్ కుమార్, వివిధ గ్రామాల పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో రంగుల హోలీ సంబరాలు..

- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా హోలీ వేడుకలు..
- జిల్లా ప్రజలకు,పోలీసు అధికారులకు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు.
- అధికారులు,సిబ్బందిలో స్టెప్పులతో ఉత్సాహాన్ని నింపిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే.



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో హోలీ పండుగను అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగులు పూసుకుంటూ, బ్యాండ్ మేళాల మధ్య స్టెప్పులు వేస్తూ ఆనందంగా హోలీ పండుగను జరుపుకున్నారు.

నిత్యం విధి నిర్వహణలో నిమగ్నమై ఒత్తిడితో గడిపే పోలీసు సిబ్బందికి ఈ హోలీ వేడుకలు మంచి ఉపశమనాన్ని, ఉల్లాసాన్ని అందించాయి. కుల, మత భేదాలకు అతీతంగా అందరూ సోదరభావంతో రంగుల పండుగలో పాల్గొనడం విశేషం.

ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ.. ప్రజలందరికీ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ,హోలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆనందం,ఐక్యత,కొత్త ఉత్సాహం, వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడే పోలీసుల జీవితాల్లో కూడా ఇలాంటి పండుగలు సంతోషం, ఉత్సాహాన్ని నింపాలని తెలిపారు. పరస్పరం రంగులు పూసుకుంటూ, మిఠాయిలు పంచుకుంటూ అధికారులు, సిబ్బంది హర్షాతిరేకాలతో హోలీ సంబరాలను జరుపుకున్నారు. పోలీసు కుటుంబంలో స్నేహభావం, ఐక్యత మరింత బలపడేలా ఈ వేడుకలు నిర్వహించబడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు,ఆర్.ఐ లు, ఎస్.ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు.

## వేములవాడలో కుక్కల దాడి.. 35 మందికి గాయాలు

**బలగం టీవీ, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో గ్రామ సింహాల దాడితో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు పదుల సంఖ్యలో గ్రామ సింహాలు ప్రజలపై దాడికి దిగడంతో సుమారు 35 మంది గాయపడ్డారు. పట్టణంలోని బద్ది పోచమ్మ వీధి, వడ్ల కమ్మరి వీధి, పాత కూరగాయల మార్కెట్ ప్రాంతం, సుభాష్‌నగర్, దోబీగాట్ల పరిసరాల్లో ఈ దాడులు చోటుచేసుకున్నాయి. గాయపడిన వారిని వెంటనే వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో వరంగల్ జిల్లాకు చెందిన కొందరు భక్తులు కూడా ఉన్నట్లు సమాచారం. ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ నవీన్ మాట్లాడుతూ బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. గత నెల రోజుల వ్యవధిలో ఇదే రెండోసారి గ్రామ సింహాల దాడి జరగడంతో పట్టణ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అధికార యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు.

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

మండేపల్లి గ్రామంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా అయి –సోషల్ వెల్ఫేర్ అస్సోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమ కో ఆర్డినేటర్ , ప్రకృతి వ్యవసాయ నిపుణులు గారంపల్లి శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ గాధగోని సాగర్ అధ్యక్షతన మండేపల్లి గ్రామంలో రైతులకి సోమవారం రోజున ప్రకృతి వ్యవసాయంపై అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా ఘన, ద్రవ జీవామృతం, కాషాయల తయారీ విధానం తద్వారా పంటల సంరక్షణ వంటి అంశాల పై అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ ప్రభుదాస్, ప్రతాపరెడ్డి, శశి ఏఇ ఓ కరుణాకర్,సీఆర్ పీ జమున, జ్యోతి మరియు రైతులు దుర్గరెడ్డి, శ్రీనివాస్, ఆనంద్, సి ఏ శ్రీనివాస్, కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ లచ్చి రెడ్డి లు పాల్గొన్నారు.



## సొంత ఊరికి రెగ్యులర్‌గా వస్తా.. గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉంటా..



- నాన్న ఎప్పుడూ అడిగేవాడు.. ఊర్లో పొలం కొందాం, వ్యవసాయం చేసుకుందాం అని..
- అమ్మ ఇల్లు కట్టుకుందామని చెప్తుండేది.. ఆ కోరిక నెరవేరి నందుకు సంతోషంగా ఉంది..
- ఊరిలో ఇల్లు కట్టుకోవడం,పెళ్లి చేసుకోవడం ఒకేసారి జరగడం సంతోషంగా ఉంది.
- ఇక నుంచి రెగ్యులర్‌గా వస్తా.. ఊరికి చేసేది చాలా ఉంది..
- ప్రముఖ సినీ హీరో విజయ్ దేవరకొండ

**బలగం టీవీ, నాగర్ కర్నూల్:**

పెళ్లి అనంతరం తన కుటుంబ సభ్యులతో కలిసి సొంత గ్రామానికి వెళ్లిన ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా, అచ్చంపేట నియోజకవర్గం, బల్మూర్ మండలంలోని తుమ్మన్‌పేట ఆయన స్వగ్రామం. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇంటికి గృహప్రవేశం నిర్వహించిన అనంతరం సత్యనారాయణ వ్రతం చేశారు. ఈ సందర్భంగా తన జీవిత భాగస్వామి ప్రముఖ నటి రష్మిక మంధాన తో కలిసి ఏర్పాటు చేసిన రిసెప్షన్‌లో అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు.

సొంత ఊరు తుమ్మన్‌పేటతో నాకు ఎంతో ఎమోషనల్ బాండింగ్ ఉంది. నా మొదటి పుట్టిన రోజు ఇక్కడే జరిగింది. తర్వాత కుటుంబం ఉద్యోగాల కోసం హైదరాబాద్‌కు మారింది. నాన్న ఎప్పుడూ 'ఊర్లో పొలం కొందాం, వ్యవసాయం చేద్దాం' అనేవారు. అమ్మ 'ఇల్లు కట్టుకుందాం' అని చెప్పేది. ఈరోజు ఆ కోరిక నెరవేరడం ఎంతో ఆనందంగా ఉంది. ఊరిలో ఇల్లు కట్టుకోవడం, పెళ్లి జరగడం ఒకేసారి కావడం మరింత సంతోషాన్ని ఇస్తోంది," అని పేర్కొన్నారు. ఇక నుంచి గ్రామానికి రెగ్యులర్‌గా వస్తామని, గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తమ్ముడు ఆనంద్ పెళ్లిని కూడా గ్రామంలోనే అందరి సమక్షంలో నిర్వహిస్తామని తెలిపారు. ఊరికి చేసేది చాలా ఉందని, అందరం కలిసి ఊరిని అభివృద్ధి చేసుకుందాం. అదే విధంగా దేవరకొండ ఫౌండేషన్ ద్వారా అచ్చంపేట నియోజకవర్గంలోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో 9వ, 10వ తరగతి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని ప్రకటించారు.

# నేడు ఈడెన్‌లో తొలి సెమీస్ పోరు

- సౌతాఫ్రికా -- న్యూజిలాండ్ మధ్య పోరు
- అన్‌బీటెన్‌గా సెమీస్‌లోకి సౌతాఫ్రికా







**బలగం టీవీ, కోల్‌కతా**

టీ20 వరల్డ్ కప్--2026 క్లైమాక్స్‌కు చేరుకుంది. అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న తొలి సెమీఫైనల్ బుధవారం కోల్‌కతాలోని చారిత్రాత్మక ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనుంది. ఈ కీలక సమరంలో సౌతాఫ్రికా జాతీయ క్రికెట్ జట్టు -- న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టు తలపడనున్నాయి.

**చరిత్ర మొత్తం ప్రొటీస్‌కే అనుకూలం**

టీ20 వరల్డ్ కప్ చరిత్రలో ఈ రెండు జట్లు ఇప్పటివరకు ఐదు సార్లు ముఖాముఖి తలపడ్డాయి. ఆ ఐదు మ్యాచ్‌ల్లోనూ సౌతాఫ్రికానే విజయం సాధించడం విశేషం. 2007లో 6 వికెట్ల తేడాతో మొదలైన ఆధిపత్యం 2009లో 1 పరుగు, 2010లో 13 పరుగులు, 2014లో 2 పరుగుల తేడాతో ఉత్కంఠ విజయాలుగా కొనసాగింది. ప్రస్తుత 2026 టోర్నీలో గ్రూప్ దశలో కూడా 7 వికెట్ల తేడాతో ప్రొటీస్ జట్టు గెలిచింది.ఈ గణాంకాలు చూస్తే కివీస్ ముందున్న సవాలు కేవలం ప్రత్యర్థి జట్టే కాకుండా చరిత్ర కూడా అన్నది స్పష్టమవుతోంది.

**అన్‌బీటన్‌గా సెమీస్‌లోకి సౌతాఫ్రికా**

ఈ టోర్నీలో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా సౌతాఫ్రికా సెమీఫైనల్‌కు చేరుకుంది. "చోకర్స్" ముద్రను తుడిచిపెట్టుకోవాలనే లక్ష్యంతో ఆ జట్టు బలంగా అడుగులు వేస్తోంది. కెప్టెన్ ఐడెన్ మార్క్రామ్ నాయకత్వంలో ప్రొటీస్ బౌలింగ్ దళం ప్రత్యర్థి బ్యాటర్లకు గట్టి సవాల్ విసురుతోంది.

**కివీస్ ప్రతిఘటన**

మరోవైపు కేన్ విలియమ్సన్ సారథ్యంలో న్యూజిలాండ్ జట్టు అనుభవజ్ఞుల సమాహారంగా ఉంది. ఐసీసీ టోర్నీల్లో సెమీస్ గండం దాటాలనే పట్టుదలతో బ్లాక్ క్యాప్స్ బరిలోకి దిగుతోంది. ఒత్తిడిని జయించి చరిత్రను తిరగరాయాలనే లక్ష్యంతో సిద్ధమవుతోంది.

ఈడెన్ గార్డెన్స్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుందనే అంచనాల నేపథ్యంలో ఇరు జట్లు తమ స్పిన్ వ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో సమన్వయం సాధించిన జట్టే ఫైనల్ టికెట్ సాధించనుంది. రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ కీలక పోరులో కివీస్ పగ తీర్చుకుంటుందా? లేక సౌతాఫ్రికా తన జైత్రయాత్రను కొనసాగిస్తుందా? అన్నది క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## సెమీస్లపై వర్షం అడ్డంకి అయితే ఫలితం ఏంటంటే...

**బలగం టీవీ, ముంబై**

2026 టీ20 ప్రపంచకప్‌లో అత్యంత కీలకమైన పోరుకు రంగం సిద్ధమైంది. గురువారం (మార్చి 5) ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా భారత జాతీయ క్రికెట్ జట్టు -- ఇంగ్లాండ్ జాతీయ క్రికెట్ జట్టు జట్లు సెమీఫైనల్‌లో తలపడనున్నాయి. నాలుగోసారి పొట్టి కప్ ఫైనల్‌కు చేరాలన్న లక్ష్యంతో భారత్ బరిలోకి దిగుతుండగా, సూపర్-8లో అగ్రస్థానంతో వచ్చిన ఇంగ్లాండ్ కూడా సమరానికి సిద్ధమైంది.

అయితే మ్యాచ్ రోజున వర్షం అంతరాయం కలిగిస్తే అదేరోజు అదనంగా 90 నిమిషాల సమయం కేటాయిస్తారు. అవసరమైతే ఓవర్ల కోతతో మ్యాచ్ నిర్వహించే ప్రయత్నం చేస్తారు. పరిస్థితులు అనుకూలించకపోతే మ్యాచ్ 'రిజర్వ్ డే'కు మారుతుంది. నాకౌట్ మ్యాచ్‌లకు ఐసీసీ నిబంధనల ప్రకారం రిజర్వ్ డే తప్పనిసరి. రిజర్వ్ డే రోజున ఆట ఆగిన స్థితి నుంచి మ్యాచ్ కొనసాగుతుంది. ఆ రోజున కూడా వర్షం ఆటంకం కలిగిస్తే మరో 120 నిమిషాల అదనపు సమయం కేటాయించి కనీసం 5 ఓవర్ల మ్యాచ్ అయినా పూర్తి చేయాలని నిర్వాహకులు ప్రయత్నిస్తారు.


అన్ని ప్రయత్నాల తర్వాత కూడా మ్యాచ్ పూర్తిగా రద్దయితే సూపర్-8 పాయింట్ల పట్టిక ఆధారంగా ఫైనలిస్టును నిర్ణయిస్తారు. సూపర్-8లో ఇంగ్లాండ్ మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి 6 పాయింట్లతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. భారత్ ఒక మ్యాచ్ ఓడి, రెండు గెలిచి 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఈ లెక్కన మ్యాచ్ రద్దైతే అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లాండ్‌కే ఫైనల్ టికెట్ దక్కే అవకాశముంది.

మరో సెమీఫైనల్‌లో సౌతాఫ్రికా జాతీయ క్రికెట్ జట్టు -- న్యూజిలాండ్ జాతీయ క్రికెట్ జట్టు జట్లు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తలపడనున్నాయి. అక్కడ కూడా వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే సూపర్-8లో అజేయంగా నిలిచిన సౌతాఫ్రికానే ఫైనల్‌కు చేరుతుంది. ఒకవేళ రెండు సెమీఫైనల్స్ రద్దయితే ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. తాజా వాతావరణ నివేదికల ప్రకారం ముంబయిలో గురువారం వర్ష సూచనలు లేవని తెలుస్తోంది. కోల్‌కతాలోనూ వాతావరణం సహకరించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. దీంతో రెండు సెమీఫైనల్స్‌లోనూ పూర్తి స్థాయి 20 ఓవర్ల మ్యాచ్‌లు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## 'రయ్ రయ్ రా రా'కు టాప్ ట్రెండింగ్ క్రేజ్

**జ్వరంలోనూ రామ్‌చరణ్ డెడికేషన్ : దర్శకుడు బుచ్చిబాబు**

**బలగం టీవీ, హైదరాబాద్**




పెద్ది చిత్రం నుంచి తాజాగా విడుదలైన 'రయ్ రయ్ రా రా' పాటకు విశేష స్పందన లభిస్తోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ స్టెప్పులు, ఎనర్జీ, రగ్గడ్ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. యూట్యూబ్‌లో ఈ పాట ప్రస్తుతం టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. విడుదలైన 24 గంటలు కూడా గడవకముందే దాదాపు 20 మిలియన్ల వ్యూస్ సాధించడం విశేషం.

ఈ పాట చిత్రీకరణ సమయంలో రామ్ చరణ్‌కు తీవ్రమైన జ్వరం వచ్చిందని దర్శకుడు బుచ్చిబాబు సాన వెల్లడించారు. షఉటింగ్ నిలిపివేద్దామనగా చరణ్ 'వద్దు, కొనసాగిద్దాం' అని చెప్పి జ్వరంలోనూ చిరునవ్వుతో, పూర్తి గ్రేస్‌తో డ్యాన్స్ చేశారని తెలిపారు. ఈ విషయాన్ని చిరంజీవి చేసిన ప్రత్యేక పోస్టుకు రిప్లై ఇస్తూ బుచ్చిబాబు గుర్తుచేశారు.

'రయ్ రయ్ రా రా' పాటపై స్పందించిన చిరంజీవి, రామ్ చరణ్ ఎనర్జీ, స్పీడ్ వేరే లెవెల్‌లో ఉన్నాయని అభినందించారు. బుచ్చిబాబు పిక్చరైజేషన్, ఏ.ఆర్. రెహమాన్ సంగీతం, జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, రత్నవేలు సినిమాటోగ్రఫీ, అనంత శ్రీరామ్ సాహిత్యం---ఖశ్రీశ్రీ పవర్ ప్యాక్డ్‌గా ఉన్నాయని కొనియాడారు. అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటను రెహమాన్ స్వయంగా ఆలపించారు. ఆయన వాయిస్, చరణ్ డ్యాన్స్ స్టెప్పులు కొత్త వైబ్ సృష్టిస్తున్నాయి. గతంలో విడుదలైన 'చికిరి' పాట కూడా భారీ హిట్ కావడంతో 'పెద్ది'పై అంచనాలు మరింత పెరిగాయి. గ్రామీణ నేపథ్యంలో యాక్షన్-ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సీనియర్ నటుడు జగపతిబాబు, కన్నడ స్టార్ శివకుమార్, బొమన్ ఇరానీ, దివ్యేందు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 30న గ్రాండ్‌గా విడుదల కానుంది.




## హెచ్‌సీఏలో రూ.68.73 కోట్ల కుంభకోణం ఆరోపణలు

- జింఖానా మైదానం వద్ద స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆందోళన

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)లో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందంటూ నగరంలోని జింఖానా మైదానం వద్ద స్పోర్ట్స్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. విశాఖ ఇండస్ట్రీస్‌కు రూ.68.73 కోట్లు చెల్లించారని, ఆ చెల్లింపులో భారీ అవకతవకలు జరిగాయని నిరసనకారులు ఆరోపించారు. ఈ మొత్తాన్ని వెంటనే తిరిగి వసూలు చేయాలని డిమాండ్ చేశారు. క్రీడాకారులకు అన్యాయం చేసి ప్రైవేట్ వ్యక్తులు లాభపడ్డారని వారు మండిపడ్డారు.

ఆందోళన సందర్భంగా హెచ్‌సీఏ అధ్యక్షుడు అమర్నాథ్ స్పందిస్తూ, ఈ చెల్లింపుల వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేదని మీడియా ముందుకు వచ్చి వివరణ ఇచ్చారు. తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏ చెక్కుపై సంతకం చేయలేదని స్పష్టం చేశారు. విశాఖ ఇండస్ట్రీస్‌కు రూ.68.73 కోట్ల చెల్లింపులు తాను బాధ్యతలు చేపట్టకముందే జరిగాయని పేర్కొన్నారు. అయితే నిరసనకారులు ఆయన వివరణను అంగీకరించకుండా నగదు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అడ్డుకున్నారు. దీంతో జింఖానా మైదానం పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని క్రీడా వర్గాలు కోరుతున్నాయి.



## టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి కోర్టులో ఊరట

**దుష్ప్రచారంపై గ్యాగ్ ఆర్డర్**

**కంటెంట్ తొలగించాలని మీడియాకు ఆదేశాలులిలి**

**బలగం టీవీ, హైదరాబాద్**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడుకు హైదరాబాద్ కోర్టులో ఊరట లభించింది. తనపై జరుగుతున్న ఆధారరహిత ప్రచారాన్ని నిలిపివేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం గ్యాగ్ ఆర్డర్ జారీ చేసింది. ఈ విషయాన్ని బీఆర్ నాయుడు స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తనపై ఎలాంటి దుష్ప్రచార కథనాలు ప్రసారం చేయకూడదని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే ప్రచురితమైన లేదా ప్రసారమైన కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని కూడా న్యాయస్థానం పేర్కొన్నట్లు వివరించారు.

అదేవిధంగా Google, Facebook, YouTube, Instagram వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు కూడా సంబంధిత కంటెంట్‌ను తమ సైట్ల నుంచి తొలగించాలని కోర్టు ఆదేశించినట్లు నాయుడు తెలిపారు. తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే ఏఐ, మార్ఫింగ్ వీడియోల ద్వారా తనపై దుష్ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. "సత్యం చివరకు గెలుస్తుంది. ధర్మం వైపు నిలబడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన రేణుదేశాయ్

- అసభ్య కామెంట్లపై నాలుగు సోషల్ మీడియా అకౌంట్లపై ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్**




ప్రముఖ నటి రేణు దేశాయ్ సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. సోషల్ మీడియాలో కొంతమంది అసభ్య పదజాలంతో కామెంట్లు పెడుతున్నారని ఆమె ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా కొందరు నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో హద్దులు దాటి ప్రవర్తిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న నాలుగు సోషల్ మీడియా అకౌంట్లపై ఆధారాలతో సహా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

మహిళలు, చిన్నారులు, మూగజీవాల రక్షణ వంటి అంశాలపై రేణుదేశాయ్ తరచూ తన అభిప్రాయాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. ఇటీవల వీధి కుక్కల సమస్యపై నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలను కొందరు వక్రీకరిస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకుని అసభ్యంగా స్పందిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులను కోరినట్లు సమాచారం. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిసింది.

## నటుడు శివాజీ రాజా తండ్రి కన్నుమూత

- నేడు మహాప్రస్థానంలో అంత్యక్రియలు

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ సీనియర్ నటుడు శివాజీ రాజా కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన తండ్రి జి. రామరాజు (85) ఈ ఉదయం కన్నుమూశారు. వయోభారంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని మధురానగర్‌లో తన స్వగృహంలో ఉదయం సుమారు 8 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. తండ్రి మరణంతో శివాజీ రాజా, కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు. రామరాజు భౌతికకాయాన్ని అభిమానులు, ప్రముఖుల సందర్శనార్థం ప్రస్తుతం నివాసంలో ఉంచారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు నేడు మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రామరాజు మరణవార్త తెలిసిన వెంటనే సినీ పరిశ్రమకు చెందిన పలువురు నటులు, నిర్మాతలు, రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ శివాజీ రాజా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.